
# పరుగు పందెం

## కె.వి. రమణారావు



**వా**తావరణం బరువైన మబ్బులు కమ్ము కుని నల్లగా చిక్కబడింది. సాయంకాలాన్ని రాత్రి కబళించినట్లుగా అప్పుడే చీకటి అలుముకుంది. చిన్న పిల్లాడి రోదనం లాగా గాలి ఉండుండి సన్నగా మూలుగుతోంది.

దూరం నుంచి చలిగాలిలో తేలి వచ్చిన నీటిజల్లు రైల్వేఫస్ట్ క్లాస్ వెయిటింగ్ రూం నిలువెత్తు కిటికీలోంచి విసురుగా వచ్చి లోపల పడక్కుర్చీల్లో కూర్చున్న శివరావు, లలితలకి తగిలింది. లలిత చిరాగ్గా ఓసారి కదిలి తిరిగి నిశ్శ్చలమైంది. శివరావు కుర్చీలోంచి ఇబ్బందిగా లేచి కిటికీ రెక్క మూసే ఉద్దేశంతో కిటికీ దగ్గరగా వచ్చాడు. రెక్క వేసే ఉంది. దానికుండాల్సిన అద్దం పగిలి పోవడంతో చలిగాలి, దాంతోపాటు వచ్చే జల్లు లోపలికి నిరాఘాటంగా ప్రవే

శింస్తున్నాయి.

ఆ గదిలో వీళ్ళిద్దరే వున్నారు. ఎత్తుగా ఉన్న పై కప్పు నుంచి వేలాడుతున్న వైరు చివరి పాత బల్బు నుంచి వస్తున్న గుడ్డి వెలుగు గదంతా మందంగా పరచుకొని మూలల్లో చీకటితో సంధి చేసుకుంది. పెద్దరెక్కల పాత కాలపు ఫ్యాను నిశ్చలంగా వేలాడుతూంది.

శివరావు కిటికీ లోంచి దిగంతాల వైపు చూశాడు. గాఢమైన తుఫాను మబ్బులు ఆకాశాన్నంతా కమ్మేశాయి. పెద్ద వర్షం మొదలయ్యేట్టుంది. దూరంగా చెట్ల మధ్య మైదానంలో పిల్లలంతా ఆటలాపేసి గుంపుగా ఆకాశం కేసి చూస్తున్నారు. వెలుతురుని హరించి ఆకాశం చేస్తున్న కుట్ర గురించి వాళ్ళు మాట్లాడుకుంటున్నట్లు, ఏదో అస్పష్టమైన ధ్వని వాళ్ళ వైపు నుంచి వస్తోంది. శివరావుకి తన బాల్యం, తల్లి, తమ పల్లెటూరు అన్నీ గుర్తొచ్చాయి. చిన్నప్పటి జ్ఞాపకాలు వర్షంలా వేగంగా అతని మీద కురిసి తడిపేసి వెళ్ళిపోయాయి. ఆవరించిన తడిని విదిలిస్తున్నట్టుగా ఓ బరువైన నిట్టూర్పు వెలువడింది.

ఈ రైల్వేస్టేషన్‌ని తాను యాభైయేళ్ళ నుంచి చూస్తున్నాడు. చదువుకునే రోజుల్లో ఇక్కడే రైలెక్కి మద్రాసు వెళ్ళేవాడు. తమ పల్లెటూరు ఇక్కడికి తొమ్మిది మైళ్ళు. దూరం మారలేదు. స్టేషన్ కూడా పెద్దగా మారలేదు. తనలోనే వయసు ఎంతో మార్పు తెచ్చింది. తనకి ఈ స్టేషన్‌కి ఉండే అనుబంధం తెంచడం ఇష్టం లేక కాబోలు తల్లి తన స్వంత ఊళ్ళోనే ఉండిపోయింది.

"ఇంత చిన్న ఊళ్ళో ఇంతపెద్ద స్టేషన్ ఎందుకు కట్టేరు మామయ్యా?" తనోసారి తన మేనమామని అడిగాడు.

"ఈ పక్క ఊర్లో ఓ జమిందారుండే వాడులే. ఆయన కట్టించుకున్నాడు. ఆయనగారి కోసమే ఫస్ట్ క్లాస్ వెయిటింగ్ రూం. పెద్ద రైళ్ళు కూడా ఇక్కడ ఆగడం" వివరించాడు మామయ్య. ఈ రూంని, ఇందులో ఉన్న పడక్కుర్చీని, పెద్ద అద్దాన్ని తాను కిటికీలోంచి ఆసక్తిగా చూసేవాడు.

తన పెళ్లయ్యాకే లలితవాళ్ళ నాన్న ఈ రూంని దర్జాగా తెరిపించాడు. అప్పట్నుంచే ఇందులో తనకి ప్రవేశార్హత కలిగింది. తర్వాత నుంచి అమ్మని ఎప్పుడు చూడ్డానికెళ్ళినా ఇక్కడే వెయిట్ చెయ్యడం. తన జీవితంలో ఈ రూం గతానికి -వర్తమానానికి ఓ ముఖ్యమైన లింకుగా ఉండి పోయింది. గదంతా ఒక్కసారి చూశాడు. గతవైభవం బీటలు వారి బూజుపట్టింది. గోడలని అక్కడక్కడ పచ్చటినాచు ఆక్రమించింది. అద్దం చాలా వరకూ మసకేసింది. 'శుభ్రంగాను ఉంచారు కొంత నయం' అనుకున్నాడు.

ఎప్పుడూ హైదరాబాద్ వెళ్ళడానికి వెయిట్ చేయటమే. ఎన్నోయేళ్ళ తర్వాత చెన్నై వెళ్ళడం కోసం ఇక్కడ వెయిట్ చేయడం. ఇవాళ పరిస్థితి భిన్నంగా ఉంది. తుఫాను వల్ల చెన్నై వెళ్ళవలసిన రైలు చాలా ఆలస్యంగా నడుస్తోంది. రాత్రి పదిగంటలకి రావల్సిన రైలు ఏ తెల్లవారుఝామునో రావచ్చు. అంతవరకూ ఇక్కడ, ఈ రాత్రి, ఈ చలిగాలిలో, వర్షపుజల్లులో గడపక తప్పదు అనుకున్నాడు.

వర్షం సన్నగా మొదలైంది. ఉన్నట్టుండి మైదానంలో పెద్దగా కేరింతలు వినబడ్డాయి. పిల్లలు ఆకాశం చేసిన కుట్రను భగ్నం చేయగా కురుస్తున్న జల్లులో తడుస్తూ, ఎగురుతూ ఆడుతున్నారు. చిన్నప్పుడు పల్లెటూళ్ళో తను స్నేహితులతో ఇలాగే వర్షంలో ఆడేవాడు. అమ్మ వరండాలోని అరుగు మీద కూర్చొని తమ వంక మురిపెంగా చూసేది. వర్షం తండ్రి జ్ఞాపకంగా అమ్మ కళ్ళలో చెమ్మగిల్లేది.

శివరావు వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. జల్లు తగ్గినా గాలిలో చెమ్మ పెరిగింది. పక్క కుర్చీలో తల వెనుకకు వాల్చి కళ్ళు మూసుకొని కూర్చున్న లలితతో ఏదో మాట్లాడబోయి ఆ ప్రయత్నం మానుకొని ఆమె మొహం వంక చూశాడు.

ప్రశాంతంగా సాగుతున్న శివరావు జీవితంలో ఈ సంఘటన చాలా అలజడి సృష్టించింది. కొన్ని రోజులు లలితకి నిద్రాహారాలు లేవు. ఏమీ మాట్లాడదు. దేని మీదా ఆసక్తి చూపదు. తను శాశ్వతమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిందా అని అప్పట్నుంచి భయపడుతూనే ఉన్నాడు.

యాభై ఏళ్ళు వస్తున్నా ఇంకా లేతగానే ఉంది లలిత మొహం. పసుపు పచ్చని ఛాయ లేత చర్మంపైన అప్పుడప్పుడే వడలుతున్న సూచనలు. గాఢమైన నల్లటి మబ్బుల్లాంటి జుట్టులో అక్కడక్కడా తటిల్లతలు. ఒకదానికొకటి దూరంగా వెళ్ళడానికి ప్రయత్నిస్తున్న విల్లులాంటి కనుబొమ్మలు మొహాన్ని ప్రసన్నంగా ఉండేట్టు తీర్చుతాయి. తనకి నచ్చనివి ఎదురైనప్పుడు మాత్రం విల్లు వెనక్కి వంగి భృకుటి ముడివడి క్షణంలో మొహం అప్రసన్నంగా మారుతుంది. ఆ సందర్భాలు రాకుండా శివరావు ఎప్పుడూ జాగ్రత్త పడుతూంటాడు.

కానీ పదిహేను రోజుల కిందట తన స్నేహితురాలు రాగిణి అమెరికా నుండి తమబ్బాయి సందీప్ విషయం తెలుపుతూ చేసిన ఫోన్‌కాల్ లలితను తీవ్రంగా కలచివేసింది.

"లలితా, ఇదేంటి మన సందీప్ ఇలా చేశాడు? యూఎన్‌వో వాళ్ళ సేవా సంస్థలో చేరాడేమిటి? ఈ సంస్థ గురించి నీకు తెలుసా? ఇది ఆఫ్రికా, ఆసియా దేశాల పేదపిల్లల ఆరోగ్యం, చదువు గురించి పనిచేస్తుంది. అంటే ఇక సందీప్ ఈ దేశాల్లో గుడిసెల వెంట, మురికి వాడల వెంట తిరుగుతూంటాడన్న మాట. ఇందుకేనా నువు వాడిని ఇక్కడ టాప్ యూనివర్సిటీల్లో ఎం. ఎస్, ఎం.బి. ఏలు చేయించావు? గొప్ప కంపెనీల నుంచి మంచి ఆఫర్లని కాదని ఇందులో చేరాట్ట. నువ్వైనా చెప్పలేదా?"

లలిత చాలా ఆందోళన చెంది వెంటనే సందీప్‌కి ఫోన్ చేసింది. సందేప్ జవాబు తనని మరీ అప్‌సెట్ చేసింది.

"అమ్మా నా నిర్ణయం నీకు అస్సలు నచ్చదని నాకు తెలుసు. కానీ నేను నీవు చెబుతున్న కెరీర్‌కి రికన్సైల్ కాలేకపోతున్నాను. నేను చేస్తున్నదే సరిమైనదనిపిస్తోంది. కొంచెం నిదానంగా ఆలోచించు, నీకూ అలాగే అనిపిస్తుంది. నేను త్వరలోనే ఇండియా వస్తున్నాను. అన్నీ వివరంగా చెప్తాను. నువ్వే తప్పకుండా మెచ్చుకుంటావు. అంతవరకూ ప్లీజ్ బేర్ విత్ మి".

ఇది చాలక సందీప్ మళ్ళీ ఫోన్ చేసి, "నాన్నా వచ్చేనెల ఆరున చెన్నైలో మా సంస్థ కొత్త కార్యక్రమాలని గవర్నర్ ప్రారంభిస్తున్నారు. మీరు అమ్మని, ముఖ్యంగా నాన్నమ్మని తప్పకుండా తీసుకు రావాలి. నేను చెన్నై చేరగానే మిమ్మల్ని మళ్ళీ కాంటాక్ట్ చేస్తాను" అని ఆర్డరేశాడు.

ప్రశాంతంగా సాగుతున్న శివరావు జీవితంలో ఈ సంఘటన చాలా అలజడి సృష్టించింది. కొన్ని రోజులు లలితకి నిద్రాహారాలు లేవు. ఏమీ మాట్లాడదు. దేనిమీదా ఆసక్తి చూపదు. తను శాశ్వతమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిందా అని. అప్పట్నుంచి భయపడుతూనే ఉన్నాడు.

అతికష్టం మీద ఈ ప్రయాణానికి లలిత బయలుదేరింది. కానీ తన మూడ్‌లో ఏమీ మార్పు లేదు. ఇంతకీ తమ ఊరికి వెళ్ళే అమ్మకి నీరసంగా ఉంది చెన్నై రాలేనంది. లలిత స్థితిని అమ్మ గుర్తించింది. అత్తాకోడళ్ళు ఏమీ మాట్లాడుకోలేదు. ఊర్నించి బయలుదేరి తిరిగి ఇద్దరూ చెన్నై రైలెక్కడానికి స్టేషన్ చేరుకున్నారు. లలిత లేనప్పుడు "ఏమో లేరా వాడినేమనకండి. అంతగా పట్టుబట్టి వాడు చేస్తున్నాడంటే అది మంచి పనే అయ్యుంటుంది. పెద్దవాడయ్యాడు కదా. నీ పెళ్ళానికే నువ్వు నెమ్మదిగా నచ్చజెప్పు" అంది అమ్మ.

ఇంతలో ఈ తుఫాను, ఈ స్టేషన్‌లో వెయిటింగ్. ఇది ఎటుదారి తీస్తుందో అని శివరావు చాలా ఆందోళనలో ఉన్నాడు. తల వెనకకి వాల్చి మగతగా కళ్ళు మూసుకున్నాడు. అతను ఎప్పుడు ఈ వెయిటింగ్ హాల్లో కూర్చున్నా తన గతంలోకి జారిపోతాడు.

***

ఇలా రావోయ్ శివరావ్.. టెన్నిస్ చాలా బాగా ఆడతావు... ఇంకా వేరే ఆటలు ఏమొచ్చు? యు ఆర్ బ్రిలియంట్. వర్క్‌లో కూడా డిపార్ట్‌మెంట్‌లో చాలా త్వరగా పైకొస్తావు. మా అమ్మాయి లలిత వుంది చూశావూ ఒట్టి అమాయకురాలు తనలోకమేంటో తనది. ఆ ఎమ్మేతో మూడేళ్ళుగా కుస్తీ పడుతోంది. నువ్వు కాస్త గైడ్ చెయ్యాలోయ్. మీ మామయ్యే నీకు గార్డియన్ అన్నావు కదూ.

అదేంటి మామయ్యా ఇలా చెప్పాపెట్టకుండా వచ్చేశావు. మా పెద్దాఫీసర్ గారు పిలిపించారా. ముందుగా ఉత్తరం రాయొచ్చుగా. లలితని నేను పెళ్లి చేసుకోవాలా. నేను తగనేమో. వాళ్ళ పద్ధతులు వేరు అమ్మతో అడ్జస్టవుతుందంటావా.

పెద్దాయన పిలిచి పిల్లనిస్తానంటే ఆలోచిస్తావేంరా. నీ భవిష్యత్తు కోసమే చెపుతున్నా. నేను, మీ అమ్మ పాతకాలం వాళ్ళం. అడ్జస్టు కాలేకపోతే నేను లేనా? ఇంక ఆలోచించకు.

అదేంట్రా నీ పెళ్ళాం నాకున్న ఒక్కగానొక్క మనవణ్ణి ఎప్పుడో గాని ఇక్కడికి పంపదు. ఎప్పుడూ చదువేనా ఆటపాటలేవి. చెట్టూ చేమచూడొద్దా. మనుషుల్ని చూడొద్దా. ఎలా అయిపోతున్నాడో చూడు. మనిషా యంత్రమా నువ్వలా పెరగలేదా, పైకి రాలేదా మనిషంటే డబ్బు సంపాదించే యంత్రమా ఎక్కడికి వెళ్తున్నారు మీరు.

ఏమోయ్ లలితా మీకేం మీ అబ్బాయికి టాప్ ర్యాంక్ గ్యారంటీ. ఇంజనీరింగ్ ఎమ్మెస్ ఎం. బీ. ఏ యు ఎస్, జర్మనీ, జపాన్ నీ అంత శ్రద్ధ ఎవరు తీసుకుంటారు. మా వల్ల కాదు బాబోయ్ యు ఆర్ గ్రేట్

మిసెస్ చౌదరి, మిస్టర్ మోహన్రావ్, మిసెస్ శర్మ, మిసెస్ రెడ్డి, మిసెస్ మాథుర్, లక్ష్మిగారు, ఇందిర గారు సుందరేశన్, షహనాజ్, లిడియా, సుకన్య ఎవరూ మీకు పోటీ రాలేదు రియల్లీ యు ఆర్ గ్రేట్.

పిల్లాడిని పెంచడమంటే మీకేం తెలుసు ఆ పల్లె టూరెళ్తే మరి పనికొస్తాడూ. కాంపిటీషన్ ఎలా వుంది. మనస్థాయిలోనే ఉండాలా పై కెళ్ళాలా! లోకమెలా ఉంది. ఇండియాలో ఏముంది దరిద్రం తప్ప వాళ్ళ సాకేతని చూడు, నితీస్‌ని, నందినిని, మానసని జాన్సన్ని, అఫ్సర్‌ని చూడు టాప్‌టెన్‌లోంచి వన్‌లోకి వన్‌లోంచి ఇంకా పైకి చూడు చూడు.

లలితా చదువంటే ర్యాంకుల పోటీకాదు. మనిషంటే యంత్రంకాదు. జీవితమంటే హోదా, డబ్బు ఇవే కాదు. టెక్నోక్రాట్ సొసైటీ సొల్యూషన్ కాదు. ఆల్‌రౌండు డెవలెప్‌మెంట్ జ్ఞానం, సంస్కారం, అభిరుచి, ప్రేమ, క్షమ, బహుముఖం, పూర్ణ మానవుడి కోసం ప్రయాణంలో తప్పుదార్లెన్నో ముందుకి, వెనక్కి, పక్కకి, బహుయోజన విస్తీర్ణం, డబ్బు ఉత్పత్తి చేసే యంత్రాలు తయారీ వారిచ్చు నంబో జాక్షి చతురంత యాన తరగీ భూషాదు లాత్మ వ్యర్థా బీజంబుల్. బంగారు బాల్యం అంతరించి పోతున్న విలువైన దశ. ఎన్‌డేంజర్డ్ స్పీసీస్ చెట్టూ చేమ పుట్టా పూటు వర్షం వాగులు శిశువుల్లారా బుడతల్లారా.

మీరూరు కోండి మీకేమీ తెలియదు మనకంటే మనపిల్లలు పైన ఉండాలా లేదా. మీకేమీ తెలియదు. లీవిట్ టు మి. టైమయ్యింది. ఇంకా తెమల్లేదూ బస్సు హారన్ యూనిఫాం.. తిండిలోపలికి తోసుకో టిఫిన్ బాక్స్... బూట్లు.. టక.. టక.. ట్యూషన్.. హోం వర్క్... ప్రాబ్లం సాల్వింగ్.. పుస్తకాలు.. కాలిక్యులేటర్.. కంప్యూటర్.. పరీక్షలు.. పరీక్షలు.. ఆటలతో టైం వేస్ట్‌చేయకు పార్కుకెందుకూ బిచ్చగాళ్ళని చూడడానికా...సండే చూద్దాంలే... బుద్ధుందా లేదా... నాన్నమ్మ దగ్గరకా... ఇప్పుడు కాదు తర్వాత, తర్వాత, తర్వాత... నోనోనో...నిద్రొస్తోందా... హార్లిక్స్ కలపనా, టీ తాగుతావా చూడమ్మ అంతా నీ కోసం కాదూ...నువ్వుగొప్ప వాడివి కావాలని కాదూ వాణ్ణి చూడు... వీణ్ణి చూడు.. ఎలా చదువుతారో... ఎంత శ్రద్ధో... నువ్వు వాళ్ళకంటే ముందుండాలి. మా అబ్బాయి మంచివాడు కదూ.. బ్రిలియంట్ కదూ.. చెప్తే వినడం లేదా.. బుద్ధుందా లేదా... నీక్కాదూ చెప్పేది... చదువు... చదువు... ఇంకా చదువు కెరీర్... ఇంజనీరింగ్, మెడిసిన్... ఎండి...సియే...వీసా... ఎమ్మెస్... ఎంబీయే... ఇంకా పైకి పైపైకి కారు, ఇల్లు, ఫ్లాట్లు, ఫాంహౌస్, కమర్షియల్ కాంప్లెక్సక, బంగారం, వజ్రాలు, డబ్బు గడించే యంత్రం... పరిగెత్తు.. క్విక్.. ఎగబడు... దూకు.. పరిగెత్తలేని వాళ్ళని పట్టించుకోకు.. కుంటివాళ్ళని, గుడ్డి వాళ్లని వదిలెయ్ కమాన్ క్విక్ ఇంకా పరిగెత్తు... కమాన్... కమాన్...కమాన్...

***

శివరావు ఉలిక్కిపడి మగత నుంచి మేలుకున్నాడు.

తలుపు దగ్గర ఎవరో కుర్రాడు వెనక్కి ప్లాట్‌ఫాం వైపు చూస్తూ "ఇక్కడ బాంది రండి" అని అరుస్తున్నాడు.

వెంటనే అట్నుంచి వాడి కంటే కాస్త పెద్దమ్మాయి వచ్చి "ష్" అంటూ వాడి నోరు మూసి భయం భయంగా వీళ్ళవైపు చూసింది.

ఆ వెనకే ఓ నడివయస్కుడు, నడి వయస్కురాలు ముందొచ్చిన పిల్లల కంటే కాస్త పెద్దదయిన మరో అమ్మాయి తలుపు దగ్గరికి వచ్చారు.

ఆ నడివయస్కుడు లోపలికి పరకాయించి చూసి అది ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమని గ్రహించి ఒకడుగు ముందుకేసి "బయటంతా ఈదురుగాలి వీస్తోంది. జల్లు కొడుతున్నాది. మీరేమీ అనుకోకపోతే కొంచెం

## జ్యూయలరీ వ్యాపారంలోకి

ఓ నాలుగైదు సినిమాల్లో నటించి తన అవయవ సౌష్టవంతో తెలుగువారిని ఓలలాడించిన నమిత ఉన్నట్టుండి జ్యూయలరీ ఆభరణాల వ్యాపారంలోకి కాలుమోపింది. కుటుంబం మొత్తం వస్త్రవ్యాపారంలో వుండగా ఈ అమ్మడు మాత్రం గోల్డ్ బిజినెస్ చేస్తోంది. మే 10 తన పుట్టిన రోజు నాడే ముంబయ్‌లో షాపు ఓపెన్ చేసేసింది. ఇక చీఫ్‌గెస్ట్‌గా ఎవరిని పిలిచారు అని అడిగితే ఇంత గ్లామర్ నా దగ్గర వుంచుకుని ఎవరో ఎందుకు అని కొంటెగా సమాధానమిచ్చిందట. కొంచెం వల్లు చేయడం వల్లనో ఏమో సినిమా అవకాశాలు కాస్త తగ్గే సరికి జ్యూయలరీ వ్యాపారంలోకి వెళ్లిందనేది కొందరు అభిమానుల గుసగుసలు!



సేపు ఆ మూల కూర్చుంటాం. పిల్లాడికి ఒంట్లో బాగా లేదు'' అన్నాడు.

శివరావు లలిత వైపు చూశాడు. కళ్ళు మూసుకునే ఉంది. మొహంలో ఏ భావమూ లేదు. 'సరే' అన్నట్టు తలవూపాడు శివరావు.

అతను పిల్లల వేపు తిరిగి పెదవులమీద నిలువుగా వేలుంచి సంజ్ఞ చేసి 'నిశ్శబ్దంగా ఉండాలి' అంటూ గదిలోని ఓ మూలకి దారి తీశాడు. ఆవిడ తన బ్యాగులోంచి ఓ పాత దుప్పటి తీసి కింద పరచింది. వాళ్ళు నెమ్మదిగా దానిమీద కూర్చున్నారు. కుర్రాడు మాత్రం ఇంకా ఉన్న ఖాళీ కుర్చీల వేపు వెళ్ళబోయాడు. పెద్దపిల్ల వాడిని పట్టి వెనక్కిలాగి కింద కూర్చో బెట్టింది. వాడు అలిగి ఆవిడ తొడమీద తలపెట్టుకు పడుకున్నాడు.

వర్షం ధారగా పడుతూనే వుంది. అప్పుడప్పుడు చలిగాలి వీస్తూనే వుంది. బయటి ప్లాట్‌ఫాం మీద ఏవో చప్పుళ్ళు లీలగా వినిపిస్తున్నాయి. శివరావు లేచి పచార్లు ప్రారంభించాడు. లలిత కదలక పోవడం చూసి నుదురు మీద చెయ్యి పెట్టి చూశాడు. వెచ్చగా వుంది. చలిగాలికి జ్వరం వచ్చినట్టుందనుకున్నాడు.

తిరిగి కుర్చీలో కూర్చొని కళ్ళు సగం మూసి వాళ్లని పరిశీలించాడు. తల్లి తండ్రి ముగ్గురు పిల్లల కుటుంబం లాగుంది. పిల్లవాడి చేష్టల్లో ఏదో అసహజత్వం గోచరించింది. పరిశీలనగా చూశాడు. తలకాస్త పెద్దదిగా వుంది. ఆ అబ్బాయి వాళ్ళ అమ్మకి అద్దంవేపు చూపిస్తూ నవ్వుతూ చెవిలో ఏదో చెపుతున్నాడు. హావభావాలు గమనిస్తే ఆ అబ్బాయిలో కొద్దిగా మెంటల్ రిటార్డేషన్ లక్షణాలు కన్పిస్తున్నాయి. ఆమె వాడిని ఏదో ముద్దు చేస్తోంది. ఇద్దరాడపిల్లల్లో చిన్నమ్మాయికి ఓ చెయ్యి చాలా సన్నగా ఉంది. బహుశా పోలియో కావచ్చు అనుకున్నాడు. మన పల్లెటూళ్ళలో సరైన వైద్య పరిజ్ఞానం లేక ఇలాంటి పిల్లల సంఖ్య మామూలు కంటె ఎక్కువ అనుకొని నిట్టూర్చాడు. ఓసారెందుకో లలితవైపు చూశాడు. కళ్ళు సగం తెరిచి వాళ్లవైపు చూస్తోంది. మొహం గంభీరంగా ఉంది.

పిల్లలు ముగ్గురూ చాలా సేపు గుసగుసలుగా ఒకరి మీద ఒకరు పడుతూ ఏవో ఆడుకుంటూనే ఉన్నారు. పెద్దవాళ్ళిద్దరూ వారిని మురిపెంగా చూస్తూ ఏవో సర్ది చెపుతున్నారు. శబ్దం పెరిగినప్పుడంతా అతనో ఆమెనో నోటి మీద చూపుడు వేలుంచి వాళ్ళని నవ్వుతూ వారిస్తున్నారు. కాసేపు ఊరుకుంటారు. ఓసారి అబ్బాయి మరోసారి చిన్నమ్మాయి వంతులుగా ఆయనమీదో ఆవిడమీదో భుజాల మీద కెక్కి, దిగుతున్నారు, ఒళ్ళో పడుకోవడమూ, చుట్టూ తిరుగుతూ ఉండడమో చేస్తున్నారు. అప్పుడప్పుడు పెద్ద పిల్ల కూడా ఆడబోయి శివరావు వాళ్లని చూసి సిగ్గుపడి మానేస్తోంది. ఆ అయిదుగురూ ఒక వలయం, అలలు అలలుగా తన చుట్టూ అన్ని వైపులా వలయాకారంగా తిరిగి, అనేక వలయాలుగా భ్రాంతి కలిగించి, తిరిగి ఒక్కటిగా స్ఫురించినట్టు కలిసిపోయి కనిపించారు శివరావుకి, లలిత అరమోడ్పు కన్నులతో వాళ్ళనే తదేకంగా చూస్తోంది.

బయటి నల్లటి మబ్బుల్లోంచి ధారలుగా కరిగిన నీరు భూమ్మీదకి జారి మబ్బులు తేలికవుతున్నాయి.

ఉన్నట్టుండి పిల్లవాడు లేచి పరుగున వెళ్ళి అద్దం ముందున్న బల్ల ఎక్కి అద్దంలో చూసుకోబోయి నిలదొక్కుకోలేక పెద్ద శబ్దంతో కింద పడ్డాడు. వెంటనే తల్లి, పెద్ద పిల్ల ఆదుర్దాగా లేచి పరుగులాంటి నడకతో వాడి దగ్గరికి వెళ్లి తీసి నెమ్మదిగా దుప్పటి మీదకి నడిపించుకొచ్చారు. వాడు ఏడవడం మొదలెట్టాడు. తల్లీ కూతుళ్ళిద్దరూ వాడిని బుజ్జగించి పడుకోబెట్టారు. ఈ గందరగోళాన్ని లలిత నిటారుగా కదిలి తలతిప్పి చూస్తూ కూచుంది.

మగమనిషి సిగ్గుపడుతూ ''అబ్బాయికి కొంత బ్యాలన్స్ తక్కువండీ. హైదరాబాద్‌లో డాక్టర్ గారికి చూపించడానికి తీసుకెళ్తున్నాం. ఇది మూడోసారి. పుట్టడమే అలాగన్నమాట'' అన్నాడు.

''వాళ్ళిద్దరూ కూతుళ్ళా'' అడిగాడు శివరావు.

పెద్దామ్మాయిని చూపిస్తూ ''ఇది మా అమ్మాయేనండి'' అన్నాడు. ఆవిడ వెంటనే చిన్నమ్మాయి వీపు మీద ప్రేమగా చరచి ''ఇది మా ఆయన తమ్ముడు కూతురు. మా దగ్గరే ఉండి చదువుకుంటుంది'' అంది.




''వీళ్లది మరీ పల్లెటూరండి. చిన్నప్పుడు తెలియక పోలియో సోకింది'' అన్నాడతను. ఆ పిల్ల వాళ్ళ పెద్దమ్మ భుజానికి తల ఆన్చి నవ్వింది.

''మాది ఇక్కడికి నాలుగు మైళ్ళు. మా రైలు రాత్రి రెండు గుంటలకి. నేను ఎలిమెంటరీ స్కూలు టీచర్నండి'' అన్నాడతను. మళ్ళీ అతనే ''తమరు ఏ వూరెళ్తున్నారు బాబూ'' అన్నాడు.

''మద్రాసు'' అన్నాడు శివరావు చెన్నై అనబోయి.

లలితవైపు చూశాడు. అలాగే కళ్ళుసగం మూసి అన్నీ చూస్తూ వింటోంది. మొహంలో ఏ భావమూ లేదు.

''తమరు ఇక్కడ... ఈ స్టేషన్‌లో'' అన్నాడతను ప్రశ్నార్థకంగా.

''ఇక్కడికి దగ్గర్లోనే మా వూరెళ్ళివస్తున్నాం. ట్రైన్ లేటు'' అన్నాడు శివరావు.

''ఏ ఊరు బాబూ''

చెప్పాడు శివరావు. లలిత కొద్దిగా కదిలింది. లలితకిలాంటివి ఇష్టం వుండవు. పల్లెటూళ్ళలో అన్ని వివరాలు ఒకరి తర్వాత ఒకరు అడుగుతూనే ఉంటారు. కొత్తవాళ్ళు కూడా స్వంత బంధువుల్లాగ మాట్లాడుతుంటారు. అదృష్టం కొద్దీ తమ వూరుగురించి అతనికి తెలిసినట్టు లేదు. వివరాలు అడగలేదు. బతికాం అనుకున్నాడు శివరావు.

''మరి తమరి సామాను?'' అడిగాడతను.

''హైదరాబాదు నుండి మా అటెండర్ తీసుకవస్తున్నాడు. మేం పొద్దుట ట్రైన్‌కి వచ్చాం'' అన్నాడు.

''అయ్యో రాత్రంతా ఇలాగే చలిలో ఎలా వుంటారు. అమ్మగారికి ఒంట్లో నిలకడగా ఉన్నట్టు లేదే'' అన్నాడామె. లలిత ఓసారి కదిలి చీరకొంగు భుజాల చుట్టూ కప్పుకొని కళ్ళు మూసుకుంది.

కుర్రాడు నిద్దట్లో కదిలాడు. ఆవిడ వాడి తలని తొడమీద సరిగ్గా అమర్చి వాడి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి ప్రేమగా దువ్వి ముందుకి వంగి బుగ్గని నెమ్మదిగా ముద్దు పెట్టుకుంది. చిన్నమ్మాయి అతని తొడ మీద తలపెట్టుకొని కాళ్ళు ముడుచుకొని పడుకుంది. అతను భుజంమీద తువ్వాలు తీసి ఇద్దరి మీద కప్పాడు.

''అబ్బాయి చదువుతున్నాడా? ఏ క్లాసు?'' అడిగాడు శివరావు అప్రయత్నంగా.

అతను కుర్రాడి వైపుచూసి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో చూపులో ఎంతో నిండుతనం, స్వచ్ఛత, ప్రేమ కన్పించాయి శివరావుకి.

''మూడోక్లాసు. ఏదీ ఆరోగ్యం సరిగ్గా లేందే. మామూలుగా అయితే ఈ వయసుకి అయిదో క్లాసుండాలి. భగవంతుడి దయ వీడి మీద ఎలా వుందో'' అన్నాడు తను పైకి చూస్తూ.

''ఒట్టి అమాయకమండి. అయితే మనుషుల్లో రత్నమండి. కుక్కపిల్లకి దెబ్బ తగిల్నా చూడలేడండి. భజన్ల పాటలు మా బాగా పాడతాడండి. మవూరి గుళ్ళో సందడంతా వీడిదేనండి'' అందావిడ కుర్రాడి బుగ్గలు నిమురుతూ. మళ్ళీ ఆవిడే ''రేపు మేమెళ్ళి పోయాక వీళ్ళకి ఆ దేవుడే దిక్కండి'' అంది చిన్నగా నిట్టూరుస్తూ.

''ఈ చిన్నదుంది చూశారా, ఒక చెయ్యి బలహీనమనేగాని సిసింద్రీ పిల్లండి'' అందామే మళ్ళీ. పెద్ద పిల్ల ఫక్కున నవ్వింది. చిన్నపిల్ల తొడమీద చిన్నగా గిల్లుతూ. చిన్నది ముసి ముసి నవ్వులు నవ్వుతూ తువ్వాలులోంచి తలెత్తి ఓ సారి చూసి సిగ్గుపడి మళ్ళీ తల దాచుకుంది.

వర్షం పెరిగినట్టుగా శబ్దం ఎక్కువైంది. తేమగాలి విసురుగా వస్తోంది. ఎవరో స్టేషన్ ఉద్యోగి కాబోలు గదిలోకి ఓ సారి తొంగి చూసి వెళ్లిపోయాడు.

శివరావు వళ్లు విరుచుకున్నాడు. టీచరు పిల్లకి నిద్రాభంగం కలగకుండా వెనక్కి జరుగుతూ గోడకానుకున్నాడు. చలి పెరిగింది. ఆవిడ పెద్ద పిల్లకేదో చెప్పింది. ఆ పిల్ల ఓ బ్యాగు లోంచి ఓకొత్త పాలథీన్ కవరు బయటకి తీసింది.

అంతలో ఆ పిల్ల లలితని చూపిస్తూ ఆవిడకేదో నెమ్మదిగా చెప్పింది. అది గమనించిన శివరావు లలిత వైపు చూసి ఉలిక్కి పడ్డాడు. లలిత సన్నగా వణుకుతూంది. శివరావు చప్పున లేచి తన నుదుటి మీద చెయ్యి వేసి చూశాడు. వేడి చురుగ్గా తగిలింది.

''ఏం బాబూ'' అడిగిందావిడ.

''కాల్తోంది. జ్వరం బాగా వచ్చినట్టుంది'' అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

''అయ్యో అసలే చలిగా వుందే'' అంటూ ఆవిడ తన తొడపైన ఉన్న కుర్రాడి తల నెమ్మదిగా దించి పాలిథీన్ కవరు లోంచి ఓ దుప్పటి తీసి లేచివచ్చి లలితకి కప్పడానికి ప్రయత్నించింది.

''వద్దు వద్దు ఫరవాలేదు'' అంటూ లలిత నెమ్మదిగా నిటారుగా కూర్చుంది.

''అయ్యో చాలా జ్వరంగా ఉందమ్మా. ఈ చలిలో ఇలా ఎలా వుంటారు. చాలా ప్రమాదం'' అంది. అప్పటికీ లలితలో అంగీకారం కన్పించలేదు.

''దుప్పటి కొత్తదమ్మా. ఇదిగో ఇది చూడండి'' అంటూ దుప్పటికున్నలేబిల్‌ని చూపించింది.

ఆ తేమ వాతావరణంలో లేబిల్ కంటే దుప్పటి కొత్త వాసనే ప్రస్ఫుటంగా తెలుస్తోంది.

''అబ్బాయికి కప్పండి. చిన్నకుర్రాడు చలికి ఇబ్బంది పడుతున్నాడు'' అంది లలిత కొద్దిగా నీరసించిన గొంతుతో.

''వాడికేమమ్మా ఇలాంటి చలి అలవాటే. వాడు వర్షంలో తడుస్తూనే ఉంటాడు.'' అంటూ దుప్పటి లలిత తల, భుజాల మీదుగా కప్పి లలితని నిదానంగా కుర్చీలో పడుకోబెట్టి వెళ్ళిందావిడ.

మరో పాత దుప్పటి తీసి ఆ కుర్రాడి తలకింద ఉంచి ఓ పాత చీర తీసి కప్పి తాను కూడా గోడకి జారగిలబడి కూర్చుంది.

ముసురు ముసుగులా ఆవరించి అందర్నీ మగత లోకి జార్చింది.

***

స్టేషన్ మాస్టర్ వచ్చి నిద్ర లేపడంతో శివరావుకి మెలకువ వచ్చింది. చుట్టూ చూశాడు. వర్షం ఆగినట్టుంది. కానీ చెమ్మ తగ్గలేదు. బయట చీకటి కొంత పలుచబడినట్టయింది. లలిత దుప్పటి చుట్టూ చుట్టుకొని కుర్చీలో ఓ వైపుకు తిరిగి నిద్ర పోతూంది. రైలు రాబోయే సూచనగా గంట కొట్టారు. శివరావు లలితని నిద్ర లేపాడు. చెయ్యి పట్టుకు చూశాడు. కొంచెం వెచ్చగా వుంది. మొహం తేటగా వుంది.

''లలితా! లేవగలవా. ట్రైన్ ఇంకో పదినిమిషాల్లో వస్తుంది'' అన్నాడు. లలిత నిటారుగా కూర్చుని దుప్పటి విడదీసి ఉండగా చేసి ముందుకి తెచ్చింది.

అప్పుడు స్ఫురించిందిద్దరికీ వెయిటింగ్ రూంలో వాళ్ళిద్దరే ఉన్నారని.

''అరే వాళ్ళేరీ'' అంది లలిత దుప్పటికేసి చూస్తూ

''వాళ్ళ ట్రైన్ రెండుకే. వెళ్ళిపోయుంటారు'' అన్నాడు.

''మరి దుప్పటి''

''నీకు జ్వరంగా వుందని వదిలేసి వెళ్ళిపోయుంటారు. కొత్త దుప్పటి కూడాను. పాపం ఆ అబ్బాయి కోసం కొన్నట్టున్నారు. వాళ్ళెవరో కూడా తెలియదు'' అన్నాడు శివరావు నిదానంగా.

లలిత మొహంలో శివరావు ఎప్పుడూ చూడని ఏదో కొత్తదనం.

ఓ పోర్టర్ లాంటి కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి ''సార్ రైలొస్తోంది మిమ్మల్ని త్వరగా వచ్చెయ్యమన్నారు'' అని అరచి అంతే వేగంగా వెళ్ళిపోయాడు.

***

రైలు వేగం పుంజుకుంది. తుఫాను దూరంగా వెళ్ళిపోయినట్టుంది. ఆకాశం నిర్మలంగా వుంది. వెలుగు రేఖలు నెమ్మదిగా విచ్చుకుంటున్నాయి.

అంత పెద్ద తుఫాను, నల్లటి మబ్బులు అంత త్వరగా ఎలా మాయమయ్యాయో చిత్రంగా అనుకున్నాడు శివరావు కిటికీ లోంచి చూస్తూ.

''అత్తయ్యగారు కూడా వచ్చుంటే బావుండేది. సందీప్ డిజప్పాయింట్ అవుతాడు'' అంది లలిత లలితంగా.

శివరావుకి చల్లటిగాలి ఒళ్ళంతా నిమిరినట్టయింది. లలిత ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టుగా అన్పించింది ప్రసన్నంగా ఆమె వైపు చూశాడు. ఆమెలో ఏదో పెద్ద తెరిపి. అతనికి ఆమెని మొదటిసారిగా కొత్తగా చూసినట్టనిపించింది.క

''ఒక విషయం చెప్తాను. అప్రస్తుతం కాదనుకోండి. మీ అమ్మగారు చెప్పారు చూడండి మీ దూరపు చుట్టాలమ్మాయి కల్యాణి అని మన సందీప్ కోసం'' అసంపూర్తిగా ఆగింది లలిత.

''అవును.. ఆ అమ్మాయి మామూలు బియ్యే చదివిందని, పల్లెటూరుదని, ఆ ప్రసక్తే తీసుకు రావద్దని నీవు కోప్పడ్డావు కదా. అసలు నన్ను పూర్తిగా కూడా చెప్పనివ్వలేదు కదా'' అన్నాడు శివరావు బింకంగా, నవ్వునాపుకుంటూ.

చురుగ్గా చూసి తలదించేసుకుంది లలిత.

''ఆ అమ్మాయయితే మనసందీప్‌కి బావుంటుంది. చెన్నైలో సందీప్‌తో మాట్లాడి మీ అమ్మగారికి ఫోన్‌లో చెప్పండి'' అంది కిటికీలోంచి బయటవైపుకు చూస్తూ.

కొంతసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

లలిత మొహాన్ని తన వైపు తిప్పుకున్నాడు శివరావు

ఆమె కళ్ళనిండా నీళ్ళు.

''పిచ్చి లలితా. ఓడిపోయానని బాధ పడుతున్నావా'' అన్నాడు అనునయంగా.

''నేను ఓడిపోలేదు. ఓడిపోయే ప్రమాదం నుండి తప్పించుకున్నాను. ఆలస్యంగా గెలిచాను'' అంది స్థిరంగా, ప్రసన్నంగా.

''నిజమే'' అన్నాడు శివరావు నిండుగా.

రైలు వేగంగా తూర్పు వెలుతురు వైపుకు దూసుకెళ్ళింది.

